
# పద్మవ్యూహం

-డా. ఎస్. పద్మజ

కపటపు కవచాలూ, లోసుగుల ముసుగులూ తొలగించుకున్న ప్రేమికుని మనసు అమావాస్య నిశీధిలా కనపడుతుంటే...



అంతా విని మౌనంగా కూర్చుండిపోయాన్నేను. ఆవేశం రాలేదు. ఆవేదనా కలగలేదు చిత్రంగా!

అదో విచిత్రమైన స్థితి. ఊహలు ఆకాశాన్నందుకోవడంలేదు. వాస్తవాలు అగాధాల అంచున్ని తాకటమూలేదు అన్నట్టు.... స్తబ్దమైన, తటస్థమైన స్థితి!

ఆంధ్రభూమి వారపత్రిక పెద్ద కథల పోటీలో నాల్గవబహుమతి పొందిన కథ



''ఏమంటావు మానసా? మానసా?''

''అతను 'మామా' అనే దగ్గరితనంనుండి 'మానస' అనే పిలుపులోనికి మారిపోవడాన్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నాను. నా మౌనం అతన్ని కలవరపెడుతోందా? నా నిర్ణయం గురించి కలవరపడేంత ప్రేమ ఇంకా అతనిలో మిగిలే వుందా?? ఓ క్షణమలాగే ఇసుకలో పిచ్చిగీతలు గీస్తుండిపోయాను.

''ఆలోచించుకోవటానికి నాకో పదిరోజులు టైం కావాలి దిలీప్'' తలెత్తి చూస్తూ నెమ్మదిగా చెప్పాను.

అతని ముఖంలో సంతోష రేఖ కదలాడింది లీలగా! నాకోపం రానందుకా? లేక తనకనుకూల పరిస్థితి ఏర్పడుతుందన్న నమ్మకం కలిగినందుకా?? ఏమో మరి!!

''పది రోజులు కాకపోతే నెల రోజులు టైం తీసుకున్నా ఫర్లేదుకానీ బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో మానసా!''

''పదోరోజు ఉదయం ఫోనుచేస్తే నా నిర్ణయం చెబుతాను''

లేచి నించున్నాను నేను. ఇంకా మాట్లాడుకునేందుకేం మాటలు మిగులున్నాయని?!

అదే, ముందు రోజుల్లోనైతే... చెప్పుకోగా చెప్పుకోగా మిగిలిపోయిన ఊసులన్నీ మరు కలయికవరకూ వాయిదా వేసుకుని... పంచుకున్న మధురిమలు పెంచిన ఆనందంతోనూ, విడదీసే ఘడియ ఆసన్నమైనందుకు విచారంతోనూ గుండె భారంగా అనిపించేది!!

దిలీప్ కూడా లేచాడు. ఇసుక ప్రాంతాన్ని దాటి రోడ్డుమీద నడవసాగామిద్దరమూ! సెకన్లు నిమిషాల్లోకి దొర్లిపోతున్నా... మౌనం రాజ్యామేలుతోంది ఇద్దరి మధ్యా!

దారులు చీలిపోయేచోట... తలెత్తి చూశాను. అతని చూపుల్లో నా కళ్లు చిక్కుకున్నాయో క్షణం!

ఒకనాటి ఆ అనురాగ నయనాల్లో... ఈనాడు మెదలుతోన్న భావాల్ని ఎందుకు చదవలేకపోతున్నాన్నేను?! ఆ కళ్లే భావరహితమయ్యాయా? లేక నాలో స్తబ్దత నిశ్శబ్దంగా ఆవరిస్తోందా??

ఈనాటి వీడ్కోలులో... విరహమయి జీవనాన్ని ఓ అపురూపక్షణం ఛేదించినవేళ — మళ్లీ కలుస్తామన్న నిశ్చింత లేదేం?... రాదేం...?

ఈ వీడ్కోలే — తుది వీడ్కోలు కాబోతోందా?

నా కళ్లు చెమ్మగిల్లడాన్ని అతని చూపులు గ్రహించాయా? ఏమో?!

తల త్రిప్పుకుని చీకటిని చీల్చుకుంటూ వడివడిగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వైపు నడక సాగించాను.

◇ ◆ ◇

అప్పుడే రెండు గంటలు గడిచిపోయాయి. పది రోజుల సమయముందింకా! ఆలోచించాలి...! ఏమాలోచించాలి? అవునే మాలోచించాలి? ఎలా ఆలోచించాలి?? అసలు ఆలోచించడం ఎక్కడినుండి మొదలుపెట్టాలి?

తల దిమ్ముగా వుంది. మనసంతా స్తబ్దత పేరుకుపోతోంది.

నిద్ర రాక పక్కమీదనే దొర్లుతున్నాను. కాలం ఆగకుండా పరుగిడుతూనే వుంది. అర్ధరాత్రి దాటి ఎంతసేపయిందో తెలీటంలే

డు.

కనిపించని అదృశ్య హస్తమేదో గొంతును నొక్కి పట్టిన భావన! లాభంలేదు... లేచి లైటును వేశాను. గదంతా వెల్తురు పరుచుకుంది. ఈ వెలుగు నా మనసున పాకుతున్న అంధకారాన్ని పార్రదోలుతుందా? తల విదిలించాను. ఏం చేయాలి? ఇంత రాత్రి సమయాన... ఒంటరిగా!!

టేబుల్ మీద రూమ్మేటు పడేసి వుంచిన నిద్రమాత్రవొకదాన్ని చేతిలోకి తీసుకున్నాను. అలికిడికి మెలకువ వచ్చిందేమో? రూమ్మేటు ఆశ్చర్యంగా చూస్తోంది నావంక. అవును మరి నిద్రమాత్రలవల్ల కలిగే దుష్ఫలితాలేమిటో తనకు రోజా వివరించి చెప్పి ఆమె అలవాటును మాన్పించాలని తెగ ప్రయత్నించేదాన్ని. అలాంటిది.. దిలీప్ తలపులతో నిత్యచైతన్య స్రవంతిలా వుండే నేను... ఇప్పుడిలా నిద్రమాత్రలనాశ్రయిస్తున్నాను. జీవితంలో తొలిసారిగా!

అటు తిరిగి పడుకున్నాను. రేపేం చేయాలి? ఒకటే ఆలోచన!

పోనీ . తన ఊరికి వెళ్తేనో? కనీసం తల్లిదండ్రులతో చెబితేనైనా నా ఆలోచనలు ఓ గమ్యం చేరడానికి సులువవుతుందేమో!!

ఒక నిర్ణయానికి వచ్చి కళ్ళుమూసుకున్నాను. తాత్కాలికమైన రిలీఫ్‌తో!

◇ ◆ ◇

పెళ్లంటే...?

అవును పెళ్లంటే??

పెళ్లంటే... ముత్యాల ముంగిళ్లు, రతనాల లోగిళ్లు — తాళాలు, తలంబ్రాలు — మూడే ముళ్లు, ఏడే అడుగులు వెరసి — నూరేళ్లు!!

సుగంధ పరిమళాల్తో వికసిస్తోన్న కన్నెవలపుల్నీ లేత సొగసుల్నీ... భర్త అనురాగ సాన్నిధ్యంలో పొందుపరచాలని ఏ కన్నెపిల్ల కలలు కనకుండా వుండగలదు? అసలు కన్నెపిల్ల మనసే ఓ హరివిల్లు. ప్రియుని

## ఆషాఢమాసం

కొత్త దంపతులు ఆషాఢమాసంలో కలిసి వుండకూడదంటారుకదా. మరి మీరిద్దరూ కలిసే వున్నారేం'' అడిగింది ఆఫీసులో సుజాత సుబ్బలక్ష్మిని.

''మాకింకా పెళ్లికాలేదుకదా''

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



అనురాగపు జల్లులే చాలు — కన్నెవలపు సప్తవర్ణాల ఇంద్రధనుస్సుపై విరబూస్తుంది. నేను మాత్రం? దిలీప్ సాహచర్యంలోని నా జీవితాన్ని గురించి ఎన్నెన్ని ఊహాసౌధాలు నిర్మించుకున్నాను! అవన్నీ కేవలం గాలిమేడలేనా? పేక ముక్కల్లా కూలిపోనున్నాయా?

ఎదురుగా వున్న సీటుమీద కూర్చున్న ఓ కన్నెపిల్ల కిటికీ బయటకు తొంగిచూస్తూ ముసిముసిగా నవ్వుకుంటోంది తనలో తానే! ఆమె ప్రేమికుడు జ్ఞాపకాల్లో చోటు చేసుకుని వుంటాడా? ఏమో? ఆమె వదనంలోని నునుసిగ్గు భావాలు మాత్రం అవుననిపించేలా వున్నాయి.

ఆ అమ్మాయి మేను బంగారు పసిమి ఛాయలో మెరిసిపోతోంది. బంగారు ఛాయ...!!

నా ఆలోచనలతో నిమిత్తం లేకుండా ఎక్స్‌ప్రెస్ రైలు ముందుకు దూసుకుపోతోంది. మళ్లీ నా చూపులు ఆ అమ్మాయిమీదే నిల్చిపోయాయి.

బంగారు ఛాయ!!

తలత్రిప్పి నేనూ కిటికీలోనుండి బయటకు చూస్తూ కూర్చున్నాను. రైలు వేగంగా ముందుకు పయనిస్తుంటే బయట కనబడుతున్న చెట్లు మాత్రం అంతకంటే వేగంగా వెనక్కు పరుగెడుతున్నాయ్. ఆ చెట్ల వేగంతో పోటీ పడుతూ, నా మనసుకూడా గతంలోకి జారుకుంటోంది మెల్లిగా!

◇ ◆ ◇

కవర్‌మీద తమ ఇద్దరి పేర్లు చూసి ఆత్రంగా కవర్ ఓపెన్ చేసింది సుధ.

"హేయ్..." ఆనందంతో సుధ పెట్టిన కేకకు అదిరిపడ్డాను నేను.

"ఏమిటే విషయం?" ఆత్రం అణచుకోలేక కవర్ లాక్కోబోయాను.

"సస్పెన్స్! ఏమిటో ఊహించుకు చూద్దాం..." కవర్ పట్టుకుని రెండు చేతుల్నీ వెనక్కి దాచుకుంటూ ఊరించింది సుధ.

మా ఇద్దరి పేర్లమీదా వచ్చిందంటే అది ఖచ్చితంగా తామిద్దరికీ సంబంధించిన వ్యక్తి దగ్గరనుండే అయి వుండాలి. ఎవరై వుంటారు? అదీ నాలుగు మూలలా పసుపు రాసిన కవర్లో?! ఆలోచనల తెరమీదకు ఓ అందమైన రూపం వచ్చేసింది!! కాం... చ....న!!

"ఏయ్... కాంచన నుండేనా? అది వెడ్డింగ్ కార్డులా వుంది?"

"వెడ్డింగ్ కార్డులా వుండడం కాదు, వెడ్డింగ్ కార్డే! లెటర్ కూడా వ్రాసింది" చెప్పింది సుధ. ఇద్దరమూ కలిసి చదువుకున్నాం ఉత్తరాన్ని!

అనుకోని విధంగా మంచి సంబంధం కుదిరిందనీ, ఎక్కువ సమయం లేకపోవడంతో నిశ్చితార్థానికి ఇద్దరినీ పిలవలేక పోయాననీ, పెళ్లి ముహూర్తానికి నాల్రోజులముందే తామిద్దరూ రావాలనీ, అన్ని విషయాలూ తామిద్దరే చూసుకోవాలని, నిశ్చితార్థానికి ముందే తెలియపరచనందుకు మనస్ఫూర్తిగా క్షమించమనీ వ్రాసింది.

తన నేస్తానికి పెళ్లి! తన వయసే వున్న ఓ ఆడపిల్లకు పెళ్లి!

ఎందుకో... ఒక్కసారిగా నేనూ పెద్దదాన్నయిపోయానన్న ఫీలింగ్!

నేనూ, సుధ, కాంచన... ముగ్గురమూ ఒకటో క్లాసునుండి ఇంటర్‌వరకూ కలిసే

చదువుకున్నాం.

కాలేజీ మా వూళ్లో లేకపోవడంతో నేనూ, సుధ హాస్టల్లో చేరిపోయాము. నేను బి.ఎస్సీ కంప్యూటర్, కామర్స్ గ్రూప్! కాంచనమాత్రం తనకిక చదువుమీద శ్రద్ధ లేదని ఇంటర్‌తోనే ముగించేసింది. నేను నచ్చచెప్పబోయినా వినలేదు. చదువుపట్ల తన అనాసక్తత గమనించి నేనూ మిన్నకుండిపోయాను. ఈ ఆర్నెల్లుగా డిగ్రీ కాలేజి వాతావరణానికి నేనూ, సుధ అలవాటుపడ్డాం. అంతలోనే కాంచన పెళ్లివార్త! వారం రోజులు కాలేజీకి సెలవుపెట్టి బయలుదేరామిద్దరమూ!

అబ్బాయి లెక్చరర్ అట. కాంచన అందంముందు అతను వెలవెల బోతున్నా, అందమైన మనసును మించిన సౌందర్యం ఏముంటుందీ లోకంలో అనిపించింది నాకు.

కాంచనను పెళ్లికూతురిగా ముస్తాబు చేస్తోంటే కట్టలు తెంచుకున్న ఉత్సాహం! పుండుండీ నా బుగ్గల్లోనూ నునుసిగ్గులు విరబూస్తున్నాయ్!! ఎందుకు? అవునెందుకు??

ఏ అనురాగ చూపులే నా నుదుటిన సింధూరమై...

నీ చిరునవ్వుల మాలలే నా మెడలో మంగళసూత్రమై...

నీతో గడిపిన అందమైనఘడియలే నా కాలిమెట్టెలైతే...

ఇవ్వనా ప్రభూ నా కన్నెమనసు వలపు పంటల కాన్క!!


"దిల్ దిల్లీ దగ్గరికెళ్లిందా ఏంటి?" మందారాల చెక్కిళ్లలో పరధ్యానంగా వున్న నా బుగ్గ గిల్లుతూ అడిగింది సుధ!

"ఛీ పోవే" సిగ్గులో ముడుచుకుపోయింది మనసు.

నాతోపాటు బిఎస్సీ కంప్యూటర్స్ చేస్తోన్న దిలీప్‌ను దిల్లీ అని పిలుస్తుంటుంది సుధ.

## శిఖర నగరం

ఎన్నో సంవత్సరాల క్రిందట ఇంగ్లాండులో డన్‌విచ్ అనే పట్నం వుండేది. జనంతో రద్దీగా వుండే ఆ పట్నం ఒక నది ఒడ్డున పర్వత శిఖరంపై వుండేది. ఆ పర్వతం క్రమేపీ విరిగిపోయింది. దాంతోపాటు శిఖరంపై నగరం కూడా సముద్రంలో కలిసిపోయింది. —



కొడిమెల

దిలీప్‌కూడా మెరిట్ స్టూడెంట్ అవడంతో సహజంగానే పరిచయమైంది మాకు. కానీ, ఆ పరిచయం ఇంకాస్త ముందుకే పయనించి ందేమోనని సందిగ్ధం!

"దిల్ దిల్లీ దగ్గరకెళ్లటమేంటే?" మా సంభాషణ అర్థంగాక అడిగింది కాంచన. నోరు తెరిచి ఏదో చెప్పబోతోన్న సుధ బుగ్గ గిల్లాను గట్టిగా "ముందు పని కానివ్వ"మం టూ!

నా చెవుల్లో పెళ్లి వాయిద్యాలు లయగా వినబడుతున్నాయ్. మనసు పరవశత్వంలో తేలిపోతోంది! పెళ్లంటే... ఇంటిముందు పందిరి, తోరణాలు, మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణలు, పెళ్లి పీటలు, పూలమా లలు, మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు, అక్షింతలు... స్నేహితురాళ్ల ఆటపట్టింపు లూ, పెద్దల దీవెనలూ!! భావిజీవితానికి వెలుగులా వచ్చిన భర్త చిటికెన వేలందుకుని కన్నీటితో పుట్టినింటినొదిలి మెట్టినింట అడుగు పెట్టటం!! స్త్రీ జీవితంలో... ఓ అపురూప మాధుర్యం! ఓ అందమైన మలుపు!

కన్నెపిల్ల ఊహల హరివిల్లు వాస్తవానికి దూరమని ఎవరైనా చెప్పినా... ఊహలకూ, వాస్తవాలకూ మధ్యనున్న సన్నటి రేఖలాంటి తేడాను గుర్తించడానికి నా వయసెంతని?... అప్పటికి పద్దెనిమిది!

◇ ◆ ◇

మరో ఆర్నెల్లు గడిచిపోయాయి. దిలీప్ తో నా పరిచయం ప్రేమగా మారింది. ప్రేమంటే? ఎదురుచూపులు... పలకరిం పులు... చిరునవ్వులు... ఇంతేనా? ఏమో?? నా దృష్టిలో దిలీప్ కళ్లల్లో నా పట్ల కనిపించే భావమే ప్రేమంటే!!

ఫస్టియర్ ఎగ్జామ్స్ వ్రాసి ఊరికి పయన మయ్యాము నేనూ, సుధ! బయల్దేరబోతూ వుంటే టెలిగ్రాం వచ్చింది. కాంచనకు సీరియస్‌గా వుందని. ఏం జరిగిందో, కాంచనకెలా వుందోనన్న ఆదుర్దాతో కంగా రుగా బయల్దేరి కాంచన వాళ్లింటికెళ్లాము.

ఇంటిచుట్టూ గుమిగూడిన మనుష్యుల్ని చూడగానే నా మనసెందుకో కీడును శంకించింది. ఇంటిముందు వసారాలో తెల్లని గుడ్డ నిండుగా కప్పి పడుకోబెట్టి వుందో ఆకారం. మా రాకను గమనించిన కాంచన తల్లిదండ్రులిద్దరూ మమ్మల్ని పట్టుకుని భోరున ఏడ్చేశారు.

అంటే...? అంటే...? కాంచన ఇక లేదా? మనసు ముందుకు ఆలోచించలేకపో తోంది. ఎవరో ఆ ఆకారం మీద తెల్లదుప్ప టిని తొలగించారు.

"నో..." పిచ్చిపట్టిదానిలా అరిచాను నేను. కాంచన... సార్థక నామధేయురాలిలా పసిమిఛాయలో బంగారంలా మెరిసిపోయే నా ప్రియమిత్రురాలు కాంచన... వొళ్లంతా నల్లగా మాడిపోయి... ఎవరైనా చెబితే తప్ప ఆ ఆకారం కాంచనదని తెలీకుండా .... ఎలా?... ఎలా జరిగిందీ వైపరీత్యం??

నా ఒళ్లో వాలిపోయి హృదయ విదారకం గా ఏడుస్తోంది కాంచన తల్లి.—

"పెళ్లయిన పదేళ్లకు పుట్టిన ఒక్కగానొ క్క కూతురు. లక్ష్మీ కళతో బంగారంలా మెరిసిపోతుంటే కాంచన అని పేరుపెట్టుకు న్నాం. ఉన్నదొక్క పిల్ల. సుఖంగా వుంటుం

దికదాని వున్న పొలమంతా అమ్మేసి లక్షల కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లిచేశాం. అయినా కట్నం చాల్లేదనీ, ఇల్లుకూడా తాకట్టు పెట్టించి డబ్బు తీసుకురమ్మనీ భర్త, అత్త మామలు వేధించేవారట. ఈ ఇల్లుకూడా లేకపోతే మాకే ఆధారమూ మిగలదని ససేమిరా ఒప్పుకోలేదట పిచ్చితల్లి. వాళ్లన్ని కష్టాలు పెడుతుంటే కనీసం నోరువిప్పి మాతోకూడా చెప్పుకోలేదెప్పుడూ! చివరికి ... కిరోసిన్ పోసి బ్రతికుండగానే మంటల్లో మాడ్చి శవంగా పుట్టింటికి పంపించారు దాన్ని. పసుపు బట్టల్తో మెట్టినింటికి పంపుతున్నామనుకున్నామేకానీ రాక్షస మనస్తత్వాలున్న కసాయి మనుష్యుల మధ్యకు బలిపశువులా దాన్ని పంపుతున్నామని ఊహించలేదు. నా చిట్టితల్లి మళ్లీ ఎలా తిరిగొస్తుంది. ఆ కట్నం పిశాచాల మోహాన ఎన్ని లక్షలు తగలేసినా నాబిడ్డను నాకు తెచ్చివ్వగలరా? భగవంతుడా! ఈ వయసులో మాకెందుకయ్యా ఈ కడుపుకోత!?''

ఏమని ఓదార్చను ఆ కన్నతల్లిని? ఓదార్చే శక్తి నాకు మాత్రం ఎక్కడిది? కన్నీళ్లు ఆగకుండా నా చెక్కిళ్లను తడిపేస్తున్నా, ఆ తల్లి కన్నీళ్లను తుడుస్తూండిపోయాను నేను.


నిర్వికారంగా కన్న కూతురిని కర్మకాండకు సిద్ధం చేస్తున్నాడా కన్నతండ్రి!

సుధ ఓ మూల నిశ్శబ్దంగా కూర్చుంది. అప్పటికే ఆమె కళ్లు జ్వలించే అగ్నిగోళాల్లా ఎర్రబారి ఉబ్బిపోయాయి.

◇ ◆ ◇

కాలేజీ తెరవడంతో తిరిగి హాస్టల్‌కు వచ్చేశాము. నెలలు గడుస్తోన్నా కాంచన జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే వున్నాయి.

కాంచన... వికసించని పుష్పం. మొగ్గగానే రాలిపోయింది! పువ్వుల్లాంటి ఆడపిల్లల జీవితాలింతేనా? మొగ్గ దశలోనే నలిగిపోక... రాలిపోక తప్పదా??



తుమ్మెద ఆఘ్రాణించటాన్నే కోరు తూ మకరంద పరిమళాల్తో పువ్వు వికసిస్తుం దని ఎప్పటికీ తెలుసుకోలేడా ఈ పురుషుడు ?! ఆ పుష్ప మధురిమల్ని ఆస్వాదించడాని క్కూడా మూల్యం చెల్లించమని కోరే పురుషునిది తెలియనితనమా? తెలివిమీరిన తనమా?? వరకట్న రక్కసి ఉక్కు కౌగిలి లో స్త్రీల జీవితాలు పరిసమాప్తం కాక తప్పదా?నేను అందవికారినైతే కాకపోవచ్చు గాక! గంధపుఛాయ... చంద్రబింబంవంటి ముఖం... కలువమొగ్గల్లాంటి కళ్లు... సంపె ంగవంటి నాసిక... గులాబిరేకుల్లాంటి అధ రాలు... నల్లత్రాచువంటి జడ.. ఇవేవీ లేని మామూలు ఆడపిల్లను నేను! మల్లెపువ్వంటి అందాల భరిణె కాంచననే వరకట్నపు మంటల్లో మాడ్చిన ఈ పురుషలోకం నా భవిష్యత్తుకెలాంటి తీర్పునివ్వబోతోంది? ఆ డపిల్లగా జీవితాన్ని గురించి అంత లోతుగా ఆలోచించడం నాకదే మొదటిసారి. ఒక్కసా రిగా హృదయం భారమైంది. నా ఆవేదనను పంచుకుని, మనసును తేలికపరచే హృదయ మొక్కటే...దిలీప్!!

కాంచన కన్నీటి కథ విన్న దిలీప్ సిన్సియర్‌గా బాధపడ్డాడు. వరకట్న పిశాచా నికి అమాయక ఆడపిల్లల్ని బలి ఇస్తోన్న కసాయి మనుష్యుల్ని ఉరికంబం ఎక్కించాల ని ఆవేశపడ్డాడు. నా దిలీప్... నా కపురూప ంగా కనిపించాడెందుకో దిగులుగా అతని ప్రక్కనే కూర్చున్న నాకు అతని మాటలు వింటుంటే అతనంటే ప్రేమతోపాటు ఒకలాంటి రక్షణ భావంకూడా కలిగింది. చుట్టూ ముళ్ల కంచె వేయబడ్డ మొక్కకు పూసిన పువ్వులా ఫీలయ్యాను నేను!

అవును... కేవలం నా ఒక్క స్నేహితు రాలికి జరిగిన సంఘటన ఆధారంగా స్త్రీ జాతిని కబళించే శత్రువులా పురుషుణ్నే చిత్రీకరించుకోవడం ఎంత అవివేకం! లోక ంలో కాంచన భర్తలాంటి వాళ్లేకాదు, తన దిలీప్‌లాంటి ఉత్తములూ వున్నారనే నిజాన్ని మరచి, స్త్రీ భవిష్యత్తునెంత భయంకరంగా ఊహించుకున్నాను నేను!

థాంక్‌గాడ్! అందరు అమ్మాయిల్లా వైవాహిక జీవితం గురించి బెంగపడకుండా దిలీప్‌లాంటి సహృదయున్నీ, ఆదర్శవాదినీ నాకు ప్రేమికునిగా ఇచ్చావ్!!

నా భవిష్యత్తును గురించిన దిగులు దిలీప్ సమక్షంలో ఎగిరిపోయిందా క్షణంలో! మనసు స్థిరత్వాన్ని సంపాదించుకుంది. క్రమ క్రమంగా కాంచన గాధను మనసు అట్టడు గు పొరల్లోకి నెట్టేసి చదువుమీదకు దృష్టిని మళ్లించాను.

◇ ◆ ◇

ప్రతి మనిషీ తనదంటూ ఓ ప్రత్యేకమై న ఇండివిద్యువాలిటీని కలిగి వుంటాడు. ఒకరి ఆలోచనాసరళికి, మరొకరి ఆలోచనా సరళికి సామీప్యతే వుండదన్నది నిజం!

కాంచన మరణం తర్వాత పూర్తిగా మారిపోయింది సుధ. సరిగ్గా నా ఆలోచన్లకు వ్యతిరేకంగా ఆమెలో సంతోషం, ఆనందం కరువైందనే చెప్పాలి. చలాకీగానే తిరిగేది కానీ, ఆ చలాకీతనం వెనుక దాగిన బాధ మాత్రం నాక్కొట్టొచ్చినట్టుగా కనబడేది. మహిళామండలి మీటింగులకి వెళ్తుంది. పత్రికల్లో వ్యాసాలు వ్రాస్తుంది. అప్పుడప్పు

డూ కవితలుకూడా. అన్నీ వరకట్నాలగురించే! సుధ కట్నా ఆచారాన్ని ద్వేషిస్తోందా లేక పురుషజాతినే ద్వేషిస్తోందా అని నా అనుమానం! అదే అడిగాను ఓ రోజు. "కట్నాలు తీసుకుంటున్న పురుషుల్ని ద్వేషిస్తున్నాను నేను" నింపాదిగా చెప్పింది సుధ. "అఫ్‌కోర్స్! కట్నం ఆశించకుండా పెళ్లి చేసుకునేవాళ్లు లక్షల మందిలో ఒక్కరుకూడా వుండరనుకో!"

"అంటే... ఏ వందమందినో మినహాయించి, మొత్తం పురుషజాతినే ద్వేషిస్తున్నావా" తలెత్తి సూటిగా నా కళ్లలోకి చూస్తూ చెప్పింది సుధ.

"లేదు మనూ! నువ్వు పొరబాటుగా అర్థం చేసుకుంటున్నావు. మానవ జాతిని స్త్రీ పురుష జాతి అంటూ విడగొట్టి, ఆ రెండు జాతుల్నీ సమాంతర రైలుపట్టాలుగా మార్చాలని నా ఉద్దేశ్యం కాదు. మన సమాజంలో స్త్రీ పురుషుల మధ్య కీలక పాత్ర వహిస్తోన్న బంధం — 'పెళ్లి'! ముచ్చటైన అనురాగ సంగమంగా మార్చుకోవాల్సిన 'పెళ్లితంతు' నేడు వ్యాపారమైపోయింది. పెళ్లి అనేది స్త్రీకి ఎంత అవసరమో, పురుషుడికీ అంతే అవసరమన్న నిజం కేవలం నినాదంగానే మిగిలిపోతోంది. స్త్రీ మెడలో మాంగల్యం కట్టడానికి 'ఖరీదు' నిర్ణయిస్తున్నాడు పురుషుడు. ఆ ఖరీదు చెల్లించలేని స్త్రీ కన్నవారి గుండెలపై కుంపటిగా వర్ణింపబడుతోంది. కట్నం రూపంలో అమ్ముడుపోయిన మగవాడు తిరిగి ఆ స్త్రీమీదే జులుం చెలాయించడం ఎంత విడ్డూరం! పెళ్లంటే... స్త్రీ తనను వరించబోయే మాంగల్యానికి మూల్యం చెల్లించుకోవాలి. పుట్టినిల్లు వదిలి మెట్టినిల్లు చేరాలి. అతనితోపాటు ఇంటిల్లిపాదికీ సేవలు చేయాలి. ఆమె ఉద్యోగస్తురాలుకూడా అయితే ఇంటా బయటాకూడా చాకిరీ చేయాలి. వెట్టిచాకిరీ. జీతభత్యాలు లేని స్త్రీ జీవితం

## పూలతోట!

"మాదు అల్లుడూ మా అమ్మాయిని పువ్వుల్లో పెట్టి ప్రేమగా చూసుకుంటావని నీకిచ్చి పెళ్లిచేశాను" అప్పగింతలనాడు మామగారు కళ్లొత్తుకుంటూ అన్నాడు.

"అలాగే ఆ రెండెకరాలు రాసివ్వండి. పూలతోట వేయిస్తాను.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



వెట్టి చాకిరీకి మరో నిదర్శనం.'' ఆవేశంగా చెప్పుకుపోతోంది సుధ. మౌనంగా వింటు న్నాను నేను.

''ఈ పద్ధతులూ, స్త్రీల పరిస్థితులూ మారాలి మనూ! వరకట్నం రూపుమాసిపో వాలి. వరకట్నపు మంటల్లో కాలి మాడిపో యిన స్త్రీల శవాల్ని ఇముడ్చుకునే ఖర్మ ఈ పుడమితల్లికి పట్టకూడదు. ఏ స్త్రీకూడా మరో కాంచన కాకూడదు... కాకూడదు మనూ...!!''

కాంచన గుర్తొచ్చినందుకేమో ఆమె కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయ్. ఆమె గుండె ఇంత అగ్నిగుండమయ్యిందా? తీవ్ర ఘాతం తగిలినట్టయింది నాకు.

''సుధా కంట్రోల్ యువర్ సెల్ఫ్... ప్లీజ్!!'' భుజంమీద చెయ్యేస్తూ అనునయం గా ఆమె కన్నీళ్లు తుడిచాను. ముడుచుకున్న మోకాళ్ల మధ్య తలపెట్టుకుని రెండు నిమిషాలు అలాగే కూర్చుండిపోయింది సుధ. నా పొరబాటేమిటో స్పష్టంగా తెలుస్తోంది నాకు. దిలీప్ స్నేహంలో, సాన్నిహిత్యంలో బాగా ఇమిడిపోయాను నేను. దిలీపే నాకు మొదటి నేస్తమయ్యాడు. మా ఇద్దరి చు ట్టూ ఉన్న ప్రపంచమే తప్ప బయటి ప్రపంచం ఇంకోటుంటుందని నేను మరచి పోయి చాలా కాలమే అయింది.

ఓవైపు కాంచన మరణం! మరోవైపు ప్రేమ పేరిట నేనిలా దూరం కావటం!!

పద్దెనిమిదేళ్ల స్నేహానుబంధం ఒక్కసారి గా ఇలా విచ్ఛిన్నమయ్యేటప్పటికి సుధ మనసెంత కృంగిపోయి వుంటుందో ఇప్పుడి ప్పుడే ఊహించగలుగుతున్నాన్నేను. హృదయం పరిస్థితుల సెగల్లో కరిగిపోతోంటే పంచు కోవటానికి తోడులేకపోవడం ఎంత దుర్భరం? పిచ్చిపిల్ల... ఎంత వేదనను ఆ చిన్ని గుండెలో దాచుకుందో?! కన్నుల్లో నీళ్లు తిరుగుతుంటే మౌనంగా ఆమె తల నిమురు తూ వుండిపోయాను. మరికొద్ది సేపటికి తేరుకున్న సుధ లేచివెళ్లి ముఖం కడుక్కొచ్చి కూర్చుంది.

''సారీ మనూ! కాంచన విషయం మనసులో అలా నాటుకుపోయింది. మరీ ఇలా బరస్ట్ అవుతానని ఊహించలేదు'' అపాలజిక్‌గా చూసింది నావంక.

''లేదు సుధా! దిలీప్ ప్రేమలో పడి నేనే మన స్నేహాన్ని నిర్లక్ష్యం చేశాననిపిస్తోంది. పక్కపక్కనే వుండి మనసుల్ని పంచు కోలేనంత దూరం పెరిగిపోయింది మనమ ధ్య. అందుక్కారణం పూర్తిగా నేనే! ప్రేమ ను ఆస్వాదించడంలో మునిగి స్నేహం పట్ల చూపిన నిర్లక్ష్యం ఇది. నన్ను క్షమించవూ?''

''ఓ... నో మనూ! ఫ్రెండ్స్ మధ్య... నో సారీ, నో థేంక్స్, ఓకే?!''

సుధ నవ్వుతూ నా చేయి నొక్కగానే నాలోని గిల్టీ ఫీలింగ్ మాయమై రిలీఫ్‌గా ఫీలయ్యాను. సుధలో నాకు అమితంగా నచ్చే గుణమదే! ఎప్పుడు ఎలా వుండాలో అలాగే వుంటుంది. ఎవర్నీ ఏ విషయంలోనూ బాధపెట్టదు. పద్దెనిమిదేళ్లుగా స్నేహితులమే అయినా, ఆనాటి సంఘటనతో ఆవేదనద్వా రా దగ్గరైన మా స్నేహానుబంధం సరికొత్త చిగుర్లు తొడిగిందనే చెప్పాలి.

నిజమే! స్నేహమంటే... ఆనందాన్ని

పంచుకోవడంమాత్రమే కాదు. ఆవేదనను పంచుకోవడం కూడా!

◇ ◆ ◇


ఆరోజు కళాశాల వార్షికోత్సవం. ఫైనలియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ కూడా అదే రోజునే! అప్పుడే ఫైనలియర్‌కొచ్చేశాం. మూడు సంవత్సరాలుగా కలిసి చదువుకుంటున్న విద్యార్థులం చివరిసారిగా జరుపుకోబోయే ఫంక్షనదే. అందర్లోనూ ఉత్సాహం పొంగి పొర్లుతోంది.

కళాశాల ఆవరణలో చుట్టూ రంగవల్లులు — రంగురంగుల కలలుగానే అమాయకపు ఆడపిల్లల మనసుల్లా... స్వచ్ఛంగా ముఖ్య అతిథులకు స్వాగతం పలుకుతూ! రంగవల్లుల ఆలోచన నాదే. వాటిని తీర్చిదిద్దింది నేనే. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో ముగ్గులు వేయడం... అందమైన సంస్కృతికి ప్రతీక అని నా అభిప్రాయం! చదువు కాక నాకు తెలిసిన విషయాలు రెండే! ఒకటి... దిలీప్ ప్రేమ! రెండు... గుమ్మం ముంగిట అందంగా రంగవల్లులు తీర్చిదిద్దడం! నాకున్న అడిషనల్ క్వాలిఫికేషన్స్ ఆ రెండే మరి. కాలేజి ప్రిన్సిపల్, లెక్చరర్స్‌లో సహా అందరూ వాటిని మెచ్చుకుంటుంటే అదో రకమైన ఆనందం. మల్లెపందిరి పైనుండి సుగంధ పరిమళాల్ని మోస్తూ తేలివచ్చిన పిల్లగాలి తెమ్మెర మనసుని తాకినట్టు — హాయినిచ్చే అనుభూతి! కళను మెచ్చుకుంటే ఆ కళను సృష్టించిన కళాకారుడి మనసు పసిపిల్లాడిలా ఎంత ఉత్తేజంగా మారిపోతుంది?! చిత్రంగా అనుభూతించాను ప్రశంసల్ని!

సాయంత్రం ఐదు గంటలకే ప్రోగ్రాం మొదలైంది. ముందుగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందించారు. తరువాత ప్రిన్సిపల్‌గారి ప్రసంగం మొదలైంది.

"డియర్ స్టూడెంట్స్! ప్రతి సంవత్సరం

## ప్రముఖ చర్చి



గోవాలోని బసిలికా ఆఫ్ బాయ్ జీసెస్ — ఇండియాలోని అత్యంత ప్రజాదరణ పొందిన చర్చిలలో ఒకటి. ఈ చర్చి 1605లో నిర్మించబడింది. సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ యొక్క రత్నాలు పొదిగిన, ఉత్తమంగా చెక్కిన సమాధి అక్కడ ఉన్నది. ప్రతి పది సంవత్సరాలకు ఆ మహాపురుషుని అవశేషాలను ప్రజల దర్శనార్థం బయల్పరుస్తారు.

— దావులూరి సురేంద్రనాథ్

కాలేజీ వార్షికోత్సవం జరుపుకుంటూనే వున్నాం. అందరమూ కలిసి చేసుకుంటున్న పండుగలా ఓ వైపు ఆనందంగానే వున్నా, ఒక బ్యాచి డిగ్రీలు పుచ్చుకుని కాలేజీని వదిలి వెళ్లిపోతుందనే నిజం మరోవైపు బాధపెడుతుంటుంది. కానీ తప్పదు. ఎందుకంటే మానవ జీవితం ఒక ప్రవాహంలాంటిది. ఏ ఒక్క స్టేజిలోనో అది ఆగిపోదు. గమ్యం చేరేవరకూ అలా సాగిపోతూనే వుంటుంది. ఇప్పుడొక బ్యాచి వెళ్లిపోతుంది. మూడు సంవత్సరాలుగా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ కలిసి మెలిసి తిరిగినవాళ్లు రేపు విడిపోతారు. ఒక్కొక్కరు ఒక్కో దారిలో తమ గమ్యంవైపు నడిచి వెళ్లిపోతారు

ఇప్పటి కలయికలు అప్పుడు వుండవ్. కేవలం జ్ఞాపకాలు మాత్రమే మనసుల అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైపోతాయి''

ఆయన ప్రసంగం కొనసాగుతోంటే హృదయం భారంగా అనిపించసాగింది. కదలికల్లేకుండా మౌనంగా వింటున్నారందరూ! ఆయన మనసుకూడా చెమ్మగిల్లిందేమో, ఓ క్షణం ఆగి మళ్లీ కొనసాగించారు.

''ఈ కళాశాల ఒక కుటీరం లాంటిది. విద్యనేర్పే గురువులలోనూ, విద్యనభ్యసించే శిష్యులతోనూ నిండివుండే ఓ ఆశ్రమమిది. ఇక్కడ కుత్సితత్వం వుండదు. రాజకీయాలు వుండవు. అమాయకత్వం, విజ్ఞానం తప్ప! కానీ రేపు మీరు అడుగు పెట్టబోయే ప్రపంచం వేరు. ఎత్తుకు పైఎత్తులు, రాజకీయ చతురతతో నిండి వున్న చదరంగమిది. స్వార్థం, అవినీతి, విశృంఖలాల మధ్య... మంచితనం, నిజాయితీ, సౌకుమార్యం అడుగంటిపోతున్నాయి. సుడిగాలిలో దీపంలా వున్న మానవత్వాన్ని చుట్టూ చేతులడ్డుపెట్టి ఆరిపోకుండా కాపాడే బాధ్యత మీ నవయువతదే! మీలో ఎందరు ఆ ఘనతను సాధించగలరో, ఎందరు ఆ సుడిగాలిలో గడ్డిపోచల్లా కొట్టుకుని పోతారో, మరెందరు ఆ అవినీతిలో భాగస్వాములవుతారో?! ఏది ఏమైనా ప్రతి విద్యార్థీ ఉన్న శిఖరాన్ని చేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను నేను. విష్యూ ఆల్ ది బెస్ట్ మై లిటిల్ ఫ్రెండ్స్!''

ఓ క్షణమంతా నిశ్శబ్దం ఆవరించింది. స్మశాన వైరాగ్యంలా! గుప్పెటలో మూసి వున్న జీవిత రహస్యాన్ని... మొగ్గరేకులు సున్నితంగా విచ్చుకున్నట్లు ఎంత అందంగా చెప్పారాయన?!

''చివరగా ఒక్క విషయం! ప్రతి ఫేర్‌వెల్ పార్టీలోనూ ఆసక్తి ఉన్నవారు ఏదైనా ఒక సామాజిక సమస్యపై ప్రసంగించి, ఆ సమస్యను నాటక రూపంలో ప్రదర్శించడం మన కాలేజీ ఆనవాయితీ. ఈ సంవత్సరం చర్చించదలచుకున్న సమస్య — వరకట్నం! ఆ సమస్యను విశదీకరించే బాధ్యతను వహిస్తున్నది... మిస్ సుధ!, బి.కాం ఫైనలియర్ స్టూడెంట్''

రెండు క్షణాల తరువాత సుధ స్టేజిమీదకు వచ్చింది. మైకుముందు నిల్చుంది.

''ముందుగా నేటి స్త్రీ ప్రపంచాన్ని వేధిస్తున్న వరకట్న సమస్యగురించి ఈ వార్షికోత్సవంలో చర్చించడానికి అవకాశమిచ్చిన మన ప్రిన్సిపల్‌గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి మనం''


తల త్రిప్పి ప్రిన్సిపల్ గారివైపు చూసింది సుధ. నవ్వుతూ తలూపారాయన ప్రొసీడ్ అన్నట్టుగా! చెప్పడం కొనసాగించింది సుధ.

"డియర్ ఫ్రెండ్స్! తొలిదశనుండి ముగింపువరకూ జీవితంలో సమస్యలనేకం. వాటిల్లో ముఖ్యమైనదీ, నేటి సమాజంలోని స్త్రీని వేధిస్తున్నదీ... వరకట్నం! ఆడపిల్ల పుట్టగానే... 'నట్టింట మహాలక్ష్మి వెలిసింది'' అని సంబరపడేవారట ఆ రోజుల్లో. కానీ కాలం మారింది. కాలంతోపాటు మనుష్యుల దృక్పథాలూ మారిపోయాయి. ఆడపిల్ల పుట్టగానే అయ్యో మైనస్సా అని తల్లిదండ్రులు విచారపడుతున్న రోజులివి. కొందరు తల్లిదండ్రులు మరికాస్త ముందుకెళ్లి — కళ్లుకూడా సరిగా తెరవని పసికూనల జీవితాల్ని మొగ్గ దశలోనే తుంచేస్తున్నారు. పల్లెల్లో పుట్టింది ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణమే నోట్లో వడ్లగింజ వేసి చంపుతున్నారు. అదే పట్నాల్లో అయితే స్కానింగ్ పుణ్యమాని ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణమే... బిడ్డ భూమ్మీద పడకుండా జాగ్రత్తపడుతున్నారు

అపురూపవరమైన మాతృత్వాన్ని నిర్దాక్షిణ్యంగా హత్యచేస్తోంది నేటి స్త్రీ! ఎందుకు?వ? భయం... కేవలం భయం... పుట్టిన ఆడపిల్ల పెళ్లి గురించిన భయం! పెళ్లిలో వరునికివ్వవలసిన కట్నకానుకల పట్టిక గురించిన భయం!! ఆ భయమే పురుటి బిడ్డల్ని నిర్దాక్షిణ్యంగా హత్యచేయిస్తోంది''

ఆసక్తిగా వింటున్నారందరూ. అందర్నీ ఓసారి పరికించి చూసి మళ్లీ కొనసాగించింది సుధ.

"అసలు వరకట్నమనేది ఎలా మొదలైంది? చాలా చిత్రంగా వుంటుంది. లోతుగా ఆలోచిస్తే! ఆడపిల్లను పసుపు బట్టల్తో మెట్టినింటికి పంపుతున్నామన్న సంతోషంతో కొంత ధనమో, ఒక బంగారు నగో, కాస్త వున్నవారైతే కొంత భూమో లాంఛనం



గా కూతురికి ముట్టజెప్పేవారట. అలా అందమైన సంప్రదాయంగా మొదలైన ఆ లాంఛనాల కార్యక్రమం నేటికి ఒక ఆచారమైపోయింది. అల్లుడి కాళ్లు కడిగి కన్యాదానం చేయడంతోపాటు, వరకట్న లాంఛనాలను సమర్పించుకోవడం ఆడపిల్లల తల్లిదండ్రులకు తప్పనిసరైపోయింది. పరిస్థితులెంతగా దిగజారిపోతున్నాయంటే... చేస్తున్న ఉద్యోగాన్నీ, హోదానీ బట్టిట వరుని ఖరీదు నిర్ణయింపబడి వుంటుంది. ఆ రేటుకు తాము తూగగలమా లేదా అన్నది ఆడపిల్లల తండ్రులు నిర్ణయించుకోగలగాలి. కట్నకానుకల్లో ఏమాత్రం తేడా వచ్చినా కిరసనాయిలు, అగ్గిపుల్లకు పనిపడక తప్పదు. ఇదీ... నేటి స్త్రీ జీవితం! కాలం ఇలాగే ముందుకు సాగిపోతే... మన దేశ బడ్జెట్ వివరాల్లో ఆకాశాన్నంటుతోన్న పెళ్లికొడుకుల ధరలు కూడా చోటుచేసుకోక తప్పదు''

ఒక్కసారిగా కరతాళ ధ్వనులు చెలరేగాయి. ఒక్క నిమిషంపాటు ఆగకుండా చప్పట్లు వినబడుతూనే వున్నాయి. నిశ్శబ్దం ఆవరించేవరకు ఆగి మళ్లీ ప్రసంగం మొదలుపెట్టింది సుధ.

''ఒకప్పుడు కన్యాశుల్కం పసిబాలికల జీవితాల్తో ఆడుకుంది. ఆ స్థానంలో నేడు 'వరకట్నం' చోటుచేసుకుంది. ఆనాటి కన్యాశుల్కాన్ని రూపుమాపేందుకు ఒక లింగం నడుం బిగించాడు. కానీ ఈనాటి వరకట్నం సమాజం పొదుల్లోకి వేళ్లు జొనుపుకుని మహా వృక్షంలా పెరిగిపోయింది. ఆ వృక్షాన్ని వేళ్లతో సహా పెకిలించాలంటే కేవలం ఒకరివల్ల సాధ్యమయ్యే పనికాదు. ఆ కార్యసాధనకు ప్రతి యువతీ ముందుకు రావాలి. అందుకు ప్రతి యువకుడూ ఓ చేయూత కావాలి''

ఆమె గొంతులో ఆవేశంలేదు. చైతన్యం వుంది. అందుకేనేమో! అబ్బాయిలుకూడా ఆసక్తిగా, ఉత్సాహంగా వింటున్నారు.

''పురుషుడా....!

నీనుండి నేను మాంగల్యాన్ని కోరడానికి బదులుగా

నానుండి నువ్వు కట్నాన్ని ఆశించకు

ప్రేమను ఆశించు!!

ఇద్దరం పరస్పరంగా మిగిలిపోదాం —

ముందు తరాలవారికి పునాదులుగా!

నీ అధికారంతోనూ దేహదారుఢ్యంతోనూ

నన్ను లోబరచుకోవాలని చూడకు,

నీ అనురాగంతో నన్ను జయించు...

నేన్నిజంగానే నీకు మనస్ఫూర్తిగా లొంగిపోతా!!

ప్రతి ఆడపిల్ల హృదయంలోనూ అంతర్లీనంగా దాగిన భావాల్ని కవితారూపంలోకి అనువదిస్తే మీక్కనిపించే నిజమిదే!''

''వన్స్ మోర్... వన్స్‌మోర్...'' ఓ అబ్బాయి గట్టిగా కేకపెట్టాడు.

చల్లని ఆ సాయంత్రం వేళ 'వరకట్న సమస్య' తాలూకు ప్రసంగం వేడిసెగలు కక్కుతోంది.

''డియర్ ఫ్రెండ్స్! మన కళాశాల ప్రాంగణంలో అమ్మాయిలతోపాటు అబ్బాయిలుకూడా వున్నారు. అందరూ గుర్తించాల్సిన నిజం ఒకటుంది. ఈ సమస్యపై ధ్వజమెత్తిన ప్రతి స్త్రీ 'పురుషద్వేషిణి'

కాదు. కేవలం వరకట్న ద్వేషిణి మాత్రమే! ఎందుకంటే... వరకట్న సమస్య సృష్టికర్త పురుషుడు మాత్రమే కాదు. ఈ సమస్య సృష్టిలో స్త్రీక్కూడా సగభాగం వుంది. ఎలాగంటే ఉదాహరణకు ఒక పెళ్లి జరుగుతున్నదనుకోండి అబ్బాయి వెల ఎంత అని ఆలోచిస్తున్నారు. కానీ ఖరీదు నిర్ణయించిన అతని తల్లీ, ఆ ఖరీదును చెల్లిస్తోన్న పెళ్లికూతురూ ఇద్దరూ ఆడవాళ్లే! రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు! అలాంటిదే ఈ వరకట్న సమస్య కూడా ఇక్కడొక సున్నిత విషయం గమనించాలి. ఓ ఆడపిల్ల కట్నం ఇవ్వకూడదు అన్న ఆదర్శాన్ని నెరవేర్చుకోవాలంటే... అటు పెళ్లికొడుకూ ఇటు కన్నతండ్రీ ఇద్దరూ ఆమెకా అవకాశం ఇవ్వాలి. అంటే ఆమెకు పురుషుడి సహకారం కావాలి. అలాగే ఓ అబ్బాయి కట్నం తీసుకోకూడదు అన్న ఆదర్శాన్ని నెరవేర్చుకోవాలంటే... అతని తల్లి ఆ అవకాశం ఇవ్వాలి. అంటే అతనికి స్త్రీ సహకారం కావాలన్నమాట. కాబట్టి ఈ వరకట్న సమస్యను పరిష్కరించాలంటే స్త్రీ పురుషుల పరస్పర సహకారం వుండాలి. అప్పుడు తప్ప ఈ సమస్య వలయంనుండి తప్పించి సమాజాన్ని ముందుకు నడిపించలేం! చివరగా ఒక్క మాట! మరో రెండు శతాబ్దాల తరువాత మ్యూజియంలో మాత్రమే దర్శనమిచ్చే దుస్థితినుండి స్త్రీ జాతిని పరిరక్షించుకుందాం! అందుకు ప్రతి ఒక్కరూ చేయూతనిద్దాం!''

ఆమె భావాల తపనను అర్థం చేసుకోవడానికి ఓ క్షణం పట్టింది నాకు. అంతే! అప్రయత్నంగా నా రెండు చేతులూ నిశ్శబ్దాన్ని చీలుస్తూ లయబద్ధంగా కదిలాయి.

తేరుకున్న స్టూడెంట్స్ ఒక్కొక్కరి చేతులూ కలవసాగాయి. కరతాళ ధ్వనులతో ఆడిటోరియం దద్దరిల్లింది!

''మేం కట్నం తీసుకోం... మేం కట్నం తీసుకోం'' అబ్బాయిలనుండి నినాదాలు.

## ఆనందం

''నీ రెండు కాళ్లకు ఆ కట్లేమిటి''

''తనకు పెళ్లి సంబంధం కుదిరిందని నా ప్రేయసి చెబితే ఆనందంతో ఎగిరి ఒక్క గంతు వేశా. అంతే...''

— బి.వి.ఎస్. బాబు (తెనాలి)



''మేం కట్నం ఇవ్వం మేం కట్నం ఇవ్వం'' మరోవైపు అమ్మాయిలనుండి నినాదాలు!! వరకట్న సమస్యగురించిన తన స్పందనకు ఇంత ప్రతిస్పందన లభిస్తోన్నా... అభావంగా నిలబడి వుంది సుధ. పైకి గంభీరంగా కనిపించే సుధలో ... ఓ సమస్యను ఇంత లోతుగా ఆలోచించి విశదీకరించే శక్తి వుందా? ఓ చైతన్య కెరటంలా కనిపించింది సుధ నా కళ్లకు.

''డియర్ ఫ్రెండ్స్! ఇప్పుడు మనమంతా వరకట్న సమస్యకు సంబంధించిన ఓ నాటకాన్ని చూద్దాం.''

స్టేజీ దిగివచ్చింది సుధ. అందరూ ఆమెను అభినందిస్తూనే వున్నారు. మా క్లాస్‌మేట్ ఓ అమ్మాయి ఆవేశం పట్టలేక గట్టిగా కౌగిలించుకుని ముద్దుపెట్టుకుంది కూడా! అయినా ఆమెలో అదే అభావం! ఆమెలో ఆ అభావకత ఎందుకు? ఎంత ఆలోచించినా అర్థంకాలేదు నాకు. వచ్చి నా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుందామె మౌనంగా! ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని చిన్నగా నొక్కాను అభినందనగా! ఏ భావమూ వ్యక్తం చేయలేదు. ఓసారి నా కళ్లలోకి చూసి తల త్రిప్పి స్టేజీవైపు దృష్టి సారించింది సుధ. నాటకం మొదలైంది. ఓ మధ్యతరగతి తల్లిదండ్రులు తమకున్న ఆస్తులు తాకట్టు పెట్టి లక్షల కట్నం ఇచ్చి కూతురి పెళ్లి చేస్తారు. కానీ కట్నం చాల్లేదనీ, లాంఛనాలు సరిగ్గా జరగలేదనీ భర్త, అత్తింటి వాళ్లు ఆమెను మానసికంగా, శారీరకంగా హింపిస్తూ వుంటారు. చివరకు ఓరోజు కిరోసిన్ పోసి అగ్గిపుల్లతో అంటించి చంపేస్తారు ఆమెను.

కళ్లముందు జరుగుతున్న నిజంలా... ఓ కాంచన కథలా వుందది. బాగా నటించారందరూ! కార్యక్రమం ముగిసింది. భారమైన హృదయాల్తో ఒకరికొకరం వీడ్కోలు చెప్పుకుని హాస్టల్‌వైపు దారితీశామందరమూ!

''నీ స్పీచెంత బావుందో తెలుసా సుధా? స్టేజిమీద నిన్నుచూసి నా ఫ్రెండు సుధేనా అని నాకే ఆశ్చర్యం వేసిందనుకో. అయినా ఆడియన్స్‌నుండి అంత రెస్పాన్స్ వస్తోంటే, నువ్వేంటి ఉలుకు పలుకు లేనిదానిలా వుండిపోయావ్?'' రూమ్‌కెళ్లాక అడిగాను సుధను.

''నేను కోరుకునేది అలాంటి ప్రశంసల్ని కాదు మనూ!''

''మరి? ప్రశ్నార్థకంగా చూశానామెవైపు.

''నా ప్రసంగం విన్న ఇంతమంది అబ్బాయిల్లో... ఒక్కరు... కనీసం ఒక్కరు. .. కట్నాన్ని ఆశించకుండా పెళ్లిచేసుకుంటే చాలు. అదే నాకు నిజమైన ప్రశంస''

ఆమె ఎందుకంత అభావంగా వుండిపోయిందో ఇప్పుడర్థమైంది నాకు. ఒక అద్భుతంలా చూస్తుండిపోయాను సుధను.

''ఒక్కరు... కనీసం ఒక్కరు కట్నాన్ని ఆశించకుండా పెళ్లిచేసుకుంటే చాలు''

ఎందుకు లేరు? తనకు తెలుసు ఆ ఒక్కరూ తన దిలీపే!

''పురుషులందు పుణ్యపురుషులు వేరయా'' అన్నట్లు నీలాల నింగిలో నక్షత్రాలెన్నో! కానీ చంద్రుడొక్కడే! ఆ చంద్రుడే నావాడైనప్పుడు నాకింకా నక్షత్రాల గొడవెందుకు?

వరకట్నం సమస్య గురించి లోతుగా ఆలోచించాల్సిన అవసరం నాకు లేదనిపించింది. దుప్పటి కప్పుకుని పడుకున్నాను. ఇంకో రెణ్ణెళ్ళల్లో ఫైనలియర్ ఎగ్జామ్స్ వున్నాయి. రేపటినుండి సీరియస్‌గా చదవడం మొదలుపెట్టాలి అనుకుంటూ.

◇ ◆ ◇

చివరి పరీక్ష వ్రాశాము. ఆ రోజుతో ఎగ్జామ్ టెన్షన్ తీరిపోయింది. ఎగ్జామ్ హాలు బయటకు రాగానే విద్యార్థులంతా గుంపులు గుంపులుగా నిలబడి మాట్లాడుకోసాగారు. ఓవైపు పరీక్షలైపోయిన ఆనందం! మరోవైపు విడిపోయే సమయమాసన్నమైందన్న బాధ!!

నేనూ, దిలీప్ అందరికీ దూరంగా గార్డెన్‌లోకి వెళ్లి కూర్చున్నాము. ఇద్దరమూ ఎగ్జామ్స్ బాగా వ్రాశాము. తరువాత ఏమిటి అన్నదే ప్రశ్న, ఇద్దరిలోనూ!

"డిగ్రీ అయిపోయిందికదా. తరువాత ఏం చేయాలనుకుంటున్నావ్ దిలీప్?"

"అదే తెలీటంలేదు సుమా!"

"పోనీ, నీ ఫర్దర్ స్టడీస్ గురించి నీ తల్లిదండ్రుల అభిప్రాయాలేమైనా వున్నాయా?"

"అలాంటిదేం లేదు మనూ. నేనేం చదువుకుంటానన్నా వాళ్లు కాదనరు"

"నేనొక మార్గం చెబుతాను. ఆ విషయం గురించి ఆలోచిస్తావా?"

"ఏమిటది మనూ?"


నెమ్మదిగా నా ఆలోచన్లు చెప్పసాగాను.

"దిలీప్! నువ్వు బ్రిలియంట్ స్టూడెంట్‌వు. ఆ విషయం ఎవ్వరైనా ఒప్పుకుంటారు. అందుకే నువ్వు ఎమ్మెస్సీ అంటూ ఏమీ పెట్టుకోకుండా సివిల్స్‌కు ప్రిపేరవు. ఓ రెండు మూడు సంవత్సరాలు కష్టపడితే నువ్వు అయ్యేయెస్ సాధించగలవన్న నమ్మకం నాకుంది. ఏమంటావు?"

నా మాటలు వింటూ అపనమ్మకంగా చూశాడు దిలీప్. "నాకది సాధ్యమంటావా

# భూగర్భ నగరం

బీజింగ్ (చైనా)లో నగరం అడుగున మరో నగరం వున్నది. దానిలో స్టోర్స్, రెస్టారెంట్స్, హోటళ్లు, సినిమాలు, క్రీడా సౌకర్యాలుమరియు ఒక ఆస్పత్రి ఉన్నాయి. చైనా రాజధానికి దిగువన 55 మీటర్లవరకు మూడు స్థాయిలో ఈ భూగర్భంలోని పెక్కు భాగాల నిర్మాణం నిలిచి వుంది. ఈ భూగర్భ నగరానికి దాదాపు 90 ప్రవేశమార్గాలున్నాయి.



— దావులూరి సురేంద్రనాథ్

మనూ? అయ్యేయెస్ అంటే చిన్నవిషయం కాదు. మూడు నాలుగేళ్లక్కూడా విజయం సాధించలేకపోతే ఈ డిగ్రీ బేసిక్‌గా ఏ ఉద్యోగమూ రాదు. అప్పుడు మన పెళ్లెలా? వద్దు మనూ! జీవితాల్తో ప్రయోగాలు చేయలేను. ఎమ్మెస్సీ చేసి ఏ చిన్న ఉద్యోగమైనా సంపాదించుకుంటాను. మన పెళ్లికి ఏ ఆటంకమూ వుండదు.

''నిన్ను నువ్వు తక్కువగా అంచనా వేసుకుంటున్నావు దిలీప్. నీగురించి నీకంటే నాకే బాగా తెలుసు. నువ్వు సివిల్స్‌లో విజయం సాధించి తీరతావు. ఆ హామీ నేనిస్తున్నాను. గట్టిగా ప్రయత్నించడం మాత్రం నీవంతు'' ఆలోచిస్తూ వుండిపోయాడు దిలీప్. సెకన్లూ, నిమిషాలు కాదు. ఓ గంట ఆలోచనల్లోనే గడిపేశాడు. నేనూ నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను.

''ఆల్‌రైట్ మనూ! నేనునీ ప్రతిపాదన మ అంగీకరిస్తున్నాను. నీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా వుండడానికి కృషిచేస్తాను. మరి నీ మాటేమిటి? మన పెళ్లి సంగతి??''

''నేను ఎమ్మెస్సీ చేస్తాను. తరువాత ఏదైనా ఓ చిరుద్యోగం చేస్తూ... నీకోసం ఎదురుచూడడమే నా పని. నిన్ను ప్రేమించిన నేరానికి'' నవ్వుతూ చెప్పాన్నేను.

నాకు తెలుసు మన సమాజంలో పెళ్లీడుకొచ్చిన ఓ ఆడపిల్ల తన ప్రేమికుని చదువుకోసం నాలుగేళ్లు నిరీక్షించడం ఎంత కష్టతరమో?! కష్టమే అయినా దిలీప్‌కోసం, ఇద్దరి అందమైన భవిష్యత్తుకోసం తప్పదు!!

విడిపోయి... హాస్టల్స్‌వైపు బయలుదేరామిద్దరమూ! ఎగ్జామ్స్ తరువాత గంట గడిచిపోయినా, కోలాహలంగానే వుందక్కడ అందరి వదనాల్లోనూ విచార రేఖలు! ఒకరి దగ్గర మరొకరు ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటున్నారు. భవిష్యత్ ప్రణాళికలు చర్చించుకుంటున్నారు. మనదంతా ఒక కుటుంబం. ఈరోజు ఆ కుటుంబం విచ్ఛిన్నమవుతోంది అన్నట్టు... అందరి కళ్లల్లోనూ తడి! 'విద్యార్థుల కూటమి ఓ కుటుంబం, ఆ కుటుంబ సామీప్యతకు నేనీరోజున దూరమవుతున్నాను' అనుకోగల ఫీలింగునూ, మనసు తడినీ పోగొట్టుకున్నాను నేను!

కాలేజీకి దూరమవుతున్నాననీ, తోటి విద్యార్థుల్ని వదిలి వెళ్తున్నాననీ... ఏ ప్రత్యేకమైన ఫీలింగూ లేదు నాలో. కొద్దిగా విచారమైతే వుండవచ్చునేమోగాని! ఎందుకంటే నా మనసు ప్రేమచుట్టూ పరిభ్రమిస్తోంది!!

రిజల్ట్స్ వచ్చాయి. దిలీప్‌కూ నాకూ డిస్టింక్షన్స్, సుధకు సెకండ్‌క్లాసు మార్కులొ వచ్చాయి. ఆరోజు అమ్మకు వంటలో సాయం చేస్తోంటే చెప్పారు నాన్న. ''మనూ నీకో విషయం చెప్పాలమ్మా''

''ఏవిటి నాన్నా అది?'' అడిగాను అంత ప్రత్యేకంగా నాతో చెప్పవలసిన విషయం ఏమిటాని ఆలోచిస్తూ!

''అదేనమ్మా, నీ పెళ్లి విషయం! మీ చిన్న మామయ్య ఓ సంబంధం తీసుకొచ్చాడు. అబ్బాయి అగ్రికల్చర్ ఆఫీసరట. మనం ఏ విషయమూ చెబితే వాళ్లు నిన్ను చూడడానికి వస్తామని కబురు పంపించారు''

దిలీప్ విషయం ఇంట్లో ఎలా చెప్పాలాని


ఆలోచిస్తున్న నాకు ఓ ఆధారం దొరికినట్టనిపించింది నాన్న మాటల్తో. కానీ వాళ్లెలా రిసీవ్ చేసుకుంటారో నా ఊహాకందడంలేదు. మా ఇంట్లోనూ, బంధువర్గంలోనూ ఎవరూకూడా ప్రేమ వివాహం చేసుకున్నట్టు దాఖలాలు లేవు. పైగా ఆడపిల్లను. అయినా సంకోచాన్ని వదిలి చెప్పక తప్పదు.

"నేనే మీకొక విషయం చెబుదామనుకుంటున్నాను నాన్నా" చేతి గోళ్లవంక చూస్తూ చెప్పాను. నాన్న ఏమిటది అని అడక్కుండానే చెప్పడం మొదలుపెట్టాను. దిలీప్ పరిచయం దగ్గరనుండి అన్ని విషయాలూ! అంతా విని నాన్న మౌనంగా వుండిపోయారు. అమ్మ మాత్రం ససేమిరా అంగీకరించనంది.

"అది కాదమ్మా! అబ్బాయి మంచివాడూ, యోగ్యుడే కావచ్చు. కానీ కులాలు వేరంటున్నావు. ఇన్ని తరాలుగా మన ఇళ్లల్లో ఇలాంటి కులాంతర వివాహాలు జరుగలేదు. ఏది ఏమైనా మరోసారి ఆలోచించుకో తల్లీ. ఎంత చదివినా నువ్వు ఆడపిల్లవు"

"ఆడపిల్లగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను నాన్నా! కాంచన విషయం మీకు గుర్తుందా? ఒకే కులంలోనే కదా! లక్షల కట్నం ఇచ్చి పెళ్లిచేశారు! చివరికేమైంది? కట్నం, లాంఛనాలు చాల్లేదని మంటల్లో మాడ్చి చంపారు. సుఖ సంసారానిక్కావలసింది కులాలూ, కట్నాలు కాదు ప్రేమలూ, మమతల పునాదులు! కాదంటావామ్మా?" ఈసారి అమ్మను ప్రశ్నించాను. సమాధానం చెప్పలేదు. ఆలోచిస్తూండిపోయింది అమ్మ.

"కులం ఒకటి కాకపోతేనేం? ప్రేమించే గుణం, అవగాహన, మానవత్వం వుంటే చాలవూ? ఎప్పుడో వందల సంవత్సరాల క్రితం... చేసుకునే వృత్తినిబట్టి కులాలుగా విభజించారు. ఇంకా ఈ రోజుల్లో కూడా వాటినే పట్టుకుని వేళ్లాడితే ఎలా? ఈనాటి



కులాలు కేవలం రాజకీయాలు. ఓట్లకోసమే ఈ కులాల విభజనలు, వాటి సమర్ధింపులూ! ఆకలి కడుపుకు అన్నం పెట్టేది కులం కాదు మానవత్వం! ఆ దృష్టితో చూస్తే... నిజానికి వున్నవి రెండే కులాలు. ఒకటి మంచి, రెండు చెడు. కాదంటారా?''

నా మాటల్ని అడ్డుకోలేదు ఇద్దరూ! మళ్ళీ కొనసాగించాను.

''వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించగలిగితే వరకట్న సమస్యనుకూడా కొంతవరకు పరిష్కరించుకోగలుగుతాం. నేనావేశంలో చెప్పడంలేదు నాన్నా, బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మీరూ ఓసారి దిలీప్‌తో మాట్లాడండి. అతని గురించి మీకూ ఓ అవగాహనంటూ ఏర్పడుతుందికదా?''

కాంచన సంఘటన తాలూకు ప్రభావం వారిమీద బాగానేవుందనుకుంటాను. వాళ్ళు దిలీప్‌తోమాట్లాడేందుకు అంగీకరించారు.

దిలీప్ వచ్చాడు. అమ్మా నాన్నలతో మాట్లాడాడు. తను అయ్యేయెస్ చేసేవరకూ ఆగితే... వాళ్ల తల్లిదండ్రుల్ని ఎలాగైనా ఒప్పించి నన్ను చేసుకుంటానని హామీ ఇచ్చాడు.

వారం రోజుల సంఘర్షణ తరువాత ఎలాగైతేనేం, అమ్మా నాన్నఒప్పుకున్నారు! ఆనాటి వాళ్ల అంగీకారంలో మా ఇద్దరి నిర్ణయంపట్ల సమర్ధింపు లేదు. కేవలం రాజీ పడ్డారని నాకనిపించింది.

నిజమే... సమాజాన్ని దాటి ఓ అడుగు ముందుకు వేయాలనుకున్నాం. సాహసంతో కూడిన ఆ అడుగు ప్రగతి పథంవైపేనని నాకు తెలుసు. కానీ ఆ సాహసాన్ని సమర్ధించే ధైర్యం వెనుకతరంవాళ్లకు మాత్రం వుండొద్దూ?! మళ్లీ మరో జంట ఇలాంటి ముందడుగు వేయాలంటే... మా వైవాహిజీవితాన్ని సఫలీకృతం చేసుకోవాలి. అంటే... సామాజిక బాధ్యతకూడా మాపై వుంటుందన్నమాట!!

ఆరోజునుండి దిలీప్‌తో కలిసి గడపబోయే వైవాహిక జీవితం గురించే నా తపన!

దిలీప్ అయ్యేయెస్ బుక్స్ తెప్పించుకుని చదవసాగాడు. నేనుఎమ్మెస్సీలో చేరిపోయాను. అదే సమయంలో సుధక్కూడా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది.

దిలీప్ యూనివర్శిటీకి ఫోన్ చేస్తుంటాడు. లెటర్స్ వ్రాస్తుంటాడు. ఎదురుచూపుల్లోనే కాలం ముందుకు సాగిపోయింది. రెండేళ్లు గడిచిపోయాయి ఏ ప్రత్యేకమైన మలుపులూ లేకుండానే.

కంప్యూటర్స్‌లో మాస్టర్ డిగ్రీతీసుకుని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరిపోయాను. దిలీప్ దీక్షగానే ప్రిపేరవుతున్నాడు. మొదటిసారి మెయిన్స్‌లో పోయింది. రెండోసారి ఇంటర్వ్యూలో మిస్సయింది. మళ్లీ ప్రయత్నంలో పడ్డాడు.

◇ ◆ ◇

ఆరోజు ఆఫీసునుండి రాగానే రూంలో వున్న సుధ వెడ్డింగ్ కార్డు చూసి, ఆఫీసుకు లీవుపెట్టి బయలుదేరాను. మరో మూడు రోజుల్లోనే పెళ్లి. కనీసం ముందుగా ఉత్తరమైనా వ్రాయలేదు. అనుకోకుండా కుదిరిపోయిందేమో! ఆలోచిస్తూనే సుధను కలిశాను.

ఇంటిముందు పెళ్లిపందిరి వెలిసింది. తోరణాలు వేళ్లాడుతున్నాయి.

సుధ మాత్రం ముభావంగా వుంది. పెళ్లికూతురి కళ ఆమె ముఖంలో మచ్చుకైనా లేదు. ఎందుకని?! సాయంత్రం డాబా మీద కూర్చుని చేతులకు గోరింటాకు పెడుతూ... అదే అడిగాను సుధను! తలెత్తి చూసింది సుధ. ఆమె కళ్లు... కళను కోల్పోయినట్లు నిస్తేజంగా వున్నాయి!

"నీకు తెలుసుగా మనూ! మూడేళ్లనుండి సంబంధాలు చూస్తూనే వున్నారు. అన్నీ తప్పిపోతూ వచ్చాయి. సమస్యంతా కట్నం దగ్గరే. ఆ వచ్చే పెళ్లికొడుకుల్లాగే నేనూ ఉద్యోగం చేస్తున్నాను. అయినా సరే కట్నం మాత్రం ఇచ్చుకోవాలిట. నేను మాత్రం కట్నం ఇచ్చేది లేదని ఖచ్చితంగా చెప్పేశాను. దాంతో నాకు చాలా పొగరన్న వార్త ప్రాకిపోయింది. నాకే పాతికేళ్లు వస్తున్నాయి. నా తరువాత చెల్లెళ్లిద్దరూకూడా పెళ్లీడుకొచ్చారు. ఒకదానికి ఇరవై రెండేళ్లు. మరో దానికి ఇరవై ఏళ్లు. నాకంటే చదువూ, ఉద్యోగం వుంది. కానీ వాళ్లకు చదువు లేదు, ఉద్యోగాలూ లేవు. మరి వాళ్లిద్దరి జీవితాలెలా? అదే అమ్మానాన్న దిగులు. నా పెళ్లి జరిగితే తప్ప వాళ్లిద్దరి పెళ్లిళ్లూ కావు. అలాంటి పరిస్థితుల్లోనే ఈ సంబంధం వచ్చింది. ఈ సంబంధానికి ఒప్పుకోకపోతే... చెల్లెళ్లిద్దరినీ చంపి తామూ చస్తామని బెదిరించారు అమ్మానాన్న. అది వొట్టి బెదిరింపేననుకున్నానుగానీ అలాంటి ప్రయత్నం కూడా చేశారు. ఇక నాకాలోచించే అవకాశం మిగల్లేదు. ఇదుగో... ఇలా హఠాత్తుగా ముహూర్తం నిర్ణయించేశారు"

వింటుంటే... హృదయం గడ్డకట్టుకుపోయింది!

బలవంతపు పెళ్లి... మనసు చంపుకున్న మనువు! సుధలాంటి ధైర్యస్తురాలిక్కూడా తప్పదా?! పెళ్లంటే... ఈత రాకపోయినా. కళ్లు మూసుకుని చెరువులో దిగి, ఆధారం కోసం గడ్డిపోచను వెదుక్కోవడమా?!

## వైరాగ్యం

"ఈ జీవితమనే కడలిలో కష్టాలు సుడిగుండాలు లాంటివి. సుఖాలు తీరం జేరడానికి ప్రయత్నించే అలలలాంటివి"

"ఏమిటోయ్ ఈ వైరాగ్యం"

"నాకు పెళ్లయిందిలే..."

— బి.వి.ఎస్.బాబు(తెనాలి)



''ఇంతకూ పెళ్లికొడుకు గురించి చెప్పనే లేదుకదూ? తాలూకాఫీసులో క్లర్క్. రెండేళ్ల క్రితం డెలివరీ టైంలో భార్య చనిపోయిందట. పిల్లల్లేరు''

అంటే రెండో పెళ్లివాడా? అందుకేనా సుధ అంత బాధపడుతోంది??

నా ఆలోచనను గ్రహించినట్టుగా చెప్పింది సుధ. ''రెండో పెళ్లివాడని నాకేమాత్రం బాధలేదు మనూ! కానీ అతనిక్కూడా కట్నం ఇచ్చుకోవాల్సిన దుస్థితి పట్టిందనే నా బాధంతా! కట్నం, లాంఛనాలు, పెళ్లిఖర్చులూ అంతా కలిపి లక్ష రూపాయలు!! ఇలా మా ముగ్గురి పెళ్లిళ్లూ చేసేటప్పటికి అమ్మానాన్న ఏ చెట్టుక్రిందో వుండాల్సి వస్తుందేమో బహుశా!''

ఆమె కళ్లల్లో చైతన్యాన్నే తప్ప దైన్యాన్ని చూడలేదెప్పుడూ!

''చూశావా మనూ? ఆ రోజు కాలేజి దేరోజున కట్నం తీసుకోము, ఇవ్వమని అబ్బాయిల్తోనూ, అమ్మాయిల్తోనూ నినాదాలిప్పించగలిగిన నేనే కట్నం ఇచ్చి పెళ్లిచేసుకుంటున్నాను. ఆనాటి ఆదర్శవాదం, ఆవేశం నాలో ఏమయ్యాయి? కష్టాల వేడికి వడలిపోయే ఆదర్శం — వట్టి గాలిమాట కదూ! అప్పటి నా చైతన్యం కేవలం కరతాళధ్వనుల కోసమేనా? కట్నం ఇవ్వడమనే అవినీతిలో నేనూ ఒక భాగస్వామినవుతున్నాను. ఇలాంటి పెళ్లి చేసుకుని నేనేం సాధిస్తాను? జీవితాన్ని సంతోషంగా ఎలా గడపగలను?''

నిజమే! కానీ పరిస్థితి చెయ్యిదాటిపోయింది. ఏం చేయగలను. నేనైనా?... ఓదార్పుగా భుజం తట్టడంతప్ప!

పెళ్లితంతు యధావిధిగా జరిగిపోతోంది. పురోహితుడు చెప్పినవన్నీ యాంత్రికంగా చేస్తోంది సుధ. పెళ్లి చేసుకుంటున్న ఉత్సాహం ఆమెలో ఏకోశానా లేదు. బలిపీఠం మీదకు... బలవంతంగా నెట్టబడిన దానిలా కనిపిస్తోంది, నా కళ్లకు! ఆనాటి మంగళ వాయిద్యాలు అమంగళప్రదంగా లేచాయి నాకు.

పెళ్లంటే... రాజీ పడడమే! కానీ ఆ రాజీ పడడంలో ఇష్టం వుండాలి. 'నీకోసమే సుమా' అనే అంకిత భావం వుండాలి. అంతేకానీ 'తప్పదు కాబట్టి' అనే అయిష్టత వుండకూడదు. మొదటిది మనసుకు ఎంత ఆహ్లాదాన్నిస్తుందో రెండోది అంత నరకాన్ని సృష్టిస్తుంది.

అమ్మా... నాన్నా... తోబుట్టువులూ... వీళ్లంతా పుట్టుకలో సంక్రమించే వరాలు! కానీ జీవిత భాగస్వామి? ఎవరి వ్యక్తిత్వ, మనస్తత్వాలకు అనుగుణంగా వాళ్లు నిర్ణయించుకోవాల్సిన ఓ తోడు! కానీ ఎందరి జీవితాల్లో ఇది నిజమవుతోంది? నేడు — ఎవరి పెళ్లి ఎవరితో జరగాలో నిర్ణయించే మొదటి సూత్రం... కట్నం! రెండోసూత్రం... కట్నం!! మూడో సూత్రం... కట్నం!!!

ఎవరికి తగ్గ సంబంధం వాళ్లు వెదుక్కోవాలనేది ఈ కలియుగ సూత్రం!

నేటి డిగ్రీలు విజ్ఞానాన్నీ, వ్యక్తిత్వాన్నీ ఎంతవరకూ పెంచుతున్నాయోకానీ... కట్నం ధరల్ని పెంచడంలో మాత్రం బాగానే తోడ్పడుతున్నాయ్!

పెళ్లంటే... కట్న కానుకలకే తప్ప మతానురాగాలకు లొంగని వ్యక్తితో ప్రేమ రాహిత్యమైన సంబంధం కారాదు! బతుకుతో రాజీపడి ముడి పెట్టుకోవలసిన బంధం కాకూడదు!

పెళ్లి తన పవిత్రతను దక్కించుకోవాలంటే... ప్రతి తల్లిదండ్రులూ తమ కొడుకు తాము చేయబోయే వ్యాపారానికి పెట్టుబడి కాదనే సున్నిత వాస్తవాన్ని గ్రహించి, తమ వ్యాపార కవచాన్ని తొలగించుకుని స్వచ్ఛమైన మనసుల్తో ముందుకు రావాలి! అది సాధ్యమేనా??

◇ ◆ ◇

ఏదో వస్తువు కింద పడిన శబ్దానికి తల తిప్పి చూశాను. ఏదో స్టేషను వచ్చినట్టుంది. కలల్లో తేలిపోతోన్న ఆ బంగారుఛాయ కన్నెపిల్ల రైలు దిగబోతూ చేతిలోని సూట్‌కేసును జారవిడిచినట్టుంది... ఆమె తల్లి కోప్పడుతోంది! కిటికీలోనుండి బయట బోర్డువైపు చూశాను. తరువాత వచ్చే స్టేషనులోనే నేను దిగాలి. ఆలోచనల్లో మునిగిపోయి టైమెలా గడిచిపోయిందో కూడా తెలియలేదు నాకు.

ఓ వీక్లీ కొని పేజీలు తిరగేయసాగాను. కానీ మనసు అక్షరాలపై నిలవలేదు. నిన్నటి దిలీప్ మాటలే... చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి!

◇ ◆ ◇


చివరకు నాలుగో ప్రయత్నంలో విజయం సాధించగలిగాడు దిలీప్!

దిలీప్... అయ్యేయెస్! మనసు ఆనందంతో పరవశించిపోయింది. సెలక్షన్స్ అయిపోగానే తాను నన్ను కలవటానికొస్తున్నట్లుగా ఫోను చేస్తే!!

మామూలు మాటలు కాగానే గారంగా అడిగాను. "నాలుగేళ్లనుండి ఈ రోజు కోసం ఎదురుచూసి చూసి అలిసిపోయాను బాబూ. మన పెళ్లెప్పుడో చెప్పవా?!"

## పాల శక్తి

*అమెరికా, జర్మనీ, ఫ్రాన్సు, జపాన్ దేశాల్లో సరాసరి ప్రతి మనిషి ఏడాదికి 400 లీటర్ల పాలు తాగుతున్నాడని అంచనా, అయితే మన దేశంలోని రాజస్థాన్‌లో మాత్రం ఏడాదికి సరాసరి ప్రతి వ్యక్తి 890 లీటర్ల పాలు తాగుతున్నాడు! రాజస్థాన్‌లో క్యాన్సర్ చాలా తక్కువమందిలో కనిపిస్తున్నది.*



పెళ్లిమాట రాగానే దిలీప్ ముఖంలో కొద్దిగా మార్పు రావడం నా దృష్టినుండి తప్పించుకోలేదు.

"మనూ! నువ్వేమీ అనుకోనంటే... ఆవేశపడనంటే... ఓ మాట చెప్పాలనుకుంటున్నాను" సీరియస్‌గా వున్న అతని మాటలు వింటుంటే ఏం జరిగి వుంటుందోనన్న ఊహకూడా నా మనసుకందలేదు!

"మా పేరెంట్స్‌తో మన వివాహం గురించి మాట్లాడాను మనూ! కులాంతర వివాహానికి వాళ్లు అంగీకరించలేదు. చివరకు ఎలాగైతేనేం వాళ్లను ఒప్పించగలిగాను, కానీ... ఒక షరతు మీద"

అదేమిటని నేనడక్కుండానే చెప్పడం కొనసాగించాడతను.

"కనీసం ఐదు లక్షలైనా లేనిదే పెళ్లి జరగదన్నారు. వాళ్లనెదిరించి నిన్ను పెళ్లిచేసుకోగల పొజిషన్లోనే వున్నాను. కానీ ఎలా? పాతికేళ్లు పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను ఎలా వదులుకోగలను?

ఆలోచించి నువ్వే ఓ పరిష్కారం చెప్పు మనూ!!"

"తల్లిదండ్రులను వదులుకోవడం ఎలా?" రామబాణంలాంటి అస్త్రం పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా!

ఎంత చిత్రం!! నిజానికి సమస్య అతనిది కానీ పరిష్కారం మాత్రం నేను చెప్పాలి!

ఏం చెప్పాలి...?? అదే ఆలోచన... విన్నటినుండి!

◇ ◆ ◇

రైలుదిగి స్టేషనులో రిక్షా ఎక్కి ఇంటికి బయలుదేరాను.

"ఏవిటే... చెప్పకుండా హఠాత్తుగా వచ్చేశావ్?" బ్యాగు లోపలికి తీసుకెళ్తూ ప్రశ్నించింది అమ్మ.

"ఆర్నెల్లు అయిపోయిందికదా... చూడాలనిపించింది! అందుకే వచ్చేశాను. ఉత్తరం వ్రాయటానికి టైం లేకపోయిందమ్మా!" అబద్ధమాడాను.

నా రాకకే సంతోషపడిపోతున్న అమ్మా నాన్నల్ని చూస్తోంటే... అప్పుడనిపించింది నాకు — ఇలా వచ్చి నేనెంత తప్పు చేశానో!?

అవును...! ఇప్పుడు దిలీప్ పోనీ అతని తల్లిదండ్రులు కట్నం కోరిన సంగతి చెబితే వాళ్లేమంటారు? ఇప్పటికే బంధువర్గాల్లో అందరికీ తెలిసిపోయింది తమ ప్రేమ సంగతి! కులాంతర వివాహం చేసుకుంటున్నా మా చదువులూ, వ్యక్తిగత పొజిషన్సూ చూసి ఎవ్వరూ నోరెత్తలేదు.

ఏడేళ్ల ప్రేమ, ఎదురుచూపుల తరువాత... కట్నం కారణంగా ఇప్పుడీ పెళ్లి ఆగిపోతుందని తెలిస్తే?! ఉహూ... తన తల్లిదండ్రులు అలా జరగడానికి ఒప్పుకోరు!

అయిదు లక్షలు!! ఎంత కష్టమైనా ఆ మూల్యాన్ని చెల్లించుకోవడానికి వెనుకాడరు వాళ్లు — తమ కూతురి భవిష్యత్తుకోసం! సంఘంలో, బంధువర్గాల్లో తమ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా వుండడం కోసం!

కులాంతర వివాహాలవల్ల కులాలు రూపు మాసిపోతాయనీ, వరకట్న సమస్య సమిసిపో

తుందని...! నాలుగేళ్ల క్రితం తల్లిదండ్రుల్తో చెప్పిన మాట నాకింకా గుర్తుంది.

వాళ్లతో ఈ విషయం చెప్పడంవల్ల ఎదురయ్యే ఫలితం గురించి ముందుగానే ఊహించుకోగలిగాను. ఇది కేవలం తను మాత్రమే ఆలోచించి పరిష్కరించుకోవాల్సిన సమస్య! ఎందుకంటే... ప్రేమించింది తను — ఎదురుచూసింది తను— పెళ్లిచేసుకోబోయేది తను — పరిష్కారం ఆలోచించుకోవాల్సిందికూడా తనే!!

ఊళ్లోనే రెండు రోజులు గడిపి మళ్లీ బయలుదేరాను.

◇ ◆ ◇


కోనేటి గట్టుమీద ఓ మెట్టుపై కూర్చుని, నీటి ఉపరితలంపై ఆహ్లాదంగా తేలియాడుతూ కదిలి వెళ్లిపోయే అందమైన అలల్ని చూస్తే... జీవితంలో పొందుపరచుకున్న మధురిమలు గుర్తొచ్చి హృదయం తేలికైపోతుంది!

సముద్రం ఒడ్డున ఇసుకలో కూర్చుని, నింగిని తాకాలన్న ఆశతో ఎగిసిపడుతూ ఓడిపోయి వెనుదిరిగే ప్రభంజన కెరటాల్ని చూస్తే... జీవితంలో ఎదురైన అపజయాలు గుర్తొచ్చి గుండె బరువెక్కుతుంది!

నిజం!! ఇసుకలో ఒంటరిగా కూర్చుని, దూరంగా ఉవ్వెత్తున లేస్తోన్న కెరటాల్ని చూస్తోంటే... జీవితంలోని ఓ వేదు రహస్యాన్ని తెలుసుకుంటున్నట్టుగా వుంది నాకు. ఈ జీవితం నాకు అపజయాన్నే మిగల్చబోతోందా?

"ఎన్ని సొగసులు నా చెలీ నీ కన్నులలో...
ఎన్ని నవ్వులు నా చెలీ నీ పెదవులలో...
ఎన్ని మందారాలు చెలీ నీ చెక్కిలిలో...
ఎన్ని అనురాగాలు చెలీ నీ చూపులలో..."

సముద్రపు హోరువేదమంత్రాల ఘోషలా వినబడుతుంటే తన ముఖంలో దోబూచులాడుతోన్న అందమైన భావాల్ని రాగయుక్తంగా పాడుతున్నాడనుకుని సిగ్గుగా



తలవంచుకుని కూర్చున్నాను!

"చందమామా నీ ముంగిట కొలువున్నవేళ..." నీలాల నింగిలోని చందమామ తనేనన్నట్లు కాలెగరేస్తూ ఓ ఫోజిచ్చి నించున్న దిలీప్‌ని చూస్తే ఒళ్లుమండి... ఈ సముద్రపు అలల దగ్గరే తనతన్ని వెంబడించుకుంది ఒకప్పుడు.

ఈ ఇసుకలోనే దిలీప్‌తో కలిసి అడుగులేసింది తాను, ఏడేకాదు... ఎన్నో అడుగులు. లెక్కలేనన్ని అడుగులు! అలల తాకిడికి ఈనాడు అవన్నీ చెరిగిపోయాయి. కానీ తన హృదయంలో మాత్రం పదిలంగా వున్నాయి. మరి దిలీప్ మనసులో ఆ జ్ఞాపకాలన్నీ మిగిలే వుంటాయా? ఏమో?! అలనాటి దగ్గరితనపు జ్ఞాపకాలను ఈనాటి విరహపు క్షణాలు దట్టమైన మబ్బుల్లా కమ్మేస్తే... రెండు భావాల మధ్య ఒరిపిడికి మనసు కంపించి మౌనంగా రోదిస్తోంది!

ఆదర్శమంటే ఏమిటి... రేపటి వాస్తవమా? లేక జీవితాన్ని రోడ్డుపాలు చేసుకోవటమా?? ఏదీ తేల్చుకోలేకపోతున్నాన్నేను! పోనీ అతని ప్రతిపాదనను అంగీకరిస్తే?! పైగా కట్నమడిగింది అతని తల్లిదండ్రులుగానీ దిలీప్ కాదుకదా? ఎందరమ్మాయిలు కట్నమిచ్చి పెళ్లిచేసుకుని హాయిగా కాపురాలు చేసుకోవడంలేదు? ఎందుకొచ్చిన ఆదర్శాలు??

ఛ... ఛ... ఏమిటిది నేనిలా ఆలోచిస్తున్నాను? ఏ మార్గంలో అయితే నా జీవితాన్ని నడిపించకూడదనుకున్నానో అదే దారిలో నడవడమా? కట్నమడిగింది ఎవరైతేనేం... దిలీప్ నా మెడలో మాంగల్యం కట్టడానికి నేనతనికి ఖరీదు చెల్లించుకోవాలి! అదేకదా అర్థం!!

ఇక్కడ ఐదు లక్షలుఇవ్వడానికి అంత డబ్బు నా దగ్గరుందా లేదా అన్నదికాదు ప్రశ్న! ఏడేళ్ల అనుబంధానికి రూపం కలిగించడాన్నికూడా వ్యాపారంగా మారుస్తున్నారన్న నిజాన్నే నా మనసు భరించలేకపోతోంది.

దిలీప్‌తో జీవితాన్ని పంచుకోవాలన్న నా కోరిక ఉత్తుంగ తరంగమై ఎగసిపడుతోంది. అది అతని అదృష్టమా? నా దురదృష్టమా?ప? మా పరిచయ మొక్కకు నిజాయితీ నీరుపోసి ప్రణయ పరిమళాల వలపు పువ్వుల్ని పూయించుకున్నాం. పరస్పరం!! మా ప్రణయానికి పరాకాష్టగా అతను నన్ను పరిణయమాడాలంటే మాత్రం... నేనతనికి 'కట్నం'మూలంగా చెల్లించుకోవాలి!

ఇలాంటి పరిస్థితి కల్పిస్తోన్న అతనిలోని పురుషుడ్ని ద్వేషించనా! ఊహూ... ఎలా ద్వేషించగలనా పురుషున్ని?? స్త్రీ ఆహ్లాదంగా అనుభూతించగల మాతృత్వమనే అపురూప వరాన్ని ఆ పురుషుడు మాత్రమే ఆమెకివ్వగలడు! నేనతన్ని ద్వేషించలేను. అతనిలోని ఇజాన్ని మాత్రమే ద్వేషిస్తున్నాను!

స్త్రీ ముగ్ధత్వాన్ని దోచే హక్కుతోపాటు, ఆ ముగ్ధత్వాన్ని కాపాడే బాధ్యతకూడా తనదేనన్న సున్నిత వాస్తవాన్ని ఎన్నటికీ గ్రహించలేడా పురుషుడు?! అందమైన వీణలాంటి కన్నె హృదయాన్ని మీటి శృతిచేసుకొమ్మని ఇస్తే... శృతిచేయడం చేతగాక వీణ తంతుల్ని తెంపేస్తున్నాడా??

చదువు, ఉద్యోగం ఉన్న నేను... పెళ్లిచే

సుకోకుండా జీవితాన్ని గడిపేయగలను. నన్ను నేను పోషించుకుంటూ! కానీ నేను కోరుకుంది అలాంటి ఒంటరి జీవితాన్ని వెళ్లదీయడంకాదు. నే కలలుగన్నది నేను, నా భర్త, ఇద్దరు పిల్లలు... ఇలాంటి కుటుంబాన్ని! ఇటు అమ్మా నాన్నలు, అటు అత్తమామల అనురాగానుబంధాల వలయాన్ని! రెండు వేర్వేరు కుటుంబాల కలయికను!!!

తనను తాను పోషించుకోగల స్త్రీ కట్టుబాట్ల సంకెళ్లను తెంచుకోవాలనుకుంటే... ఆమెకదెంత పని!? కానీ కుటుంబ వ్యవస్థ అనే సంప్రదాయ మధురిమల్ని భవిష్యత్తరాలకు అందించాల్సిన బాధ్యతలో సగభాగం స్త్రీగా నా భుజస్కందాలపైనే వుందన్న నిజాన్ని నేనెప్పుడూ మరవలేదు! కారణమేదైనా కానీ, ప్రతి స్త్రీ సంసార జీవిత బంధనాల్ని తెంచుకోవాలని ప్రయత్నిస్తే... కుటుంబ వ్యవస్థ ఏమైపోతుంది?!

పెళ్లంటే... ఒక అనురాగ సంగమం!
రెండు హృదయాల కలయిక!
రెండు జీవితాల కలయిక!
రెండు కుటుంబాల కలయిక!

పెళ్లి ఓ పవిత్ర గోపురం లాంటిది! అలాంటి 'కోవెల' కట్టడానికి మమతల పునాదులూ, అనురాగ, గోడలూ, ప్రేమ పాశాల పైకప్పులూ కావాలి. అప్పుడే ఆ కట్టడం పటిష్టంగా వుంటుంది! కానీ డబ్బు పునాదులపై కట్టబడిన నేటి కట్టడాలు ఆరంభదశలోనే బీటలు వారిపోతున్నాయి. లోపం ఎక్కడుంది?

లోకం ప్రేమ మీద నడుస్తోందా? డబ్బుమీద నడుస్తోందా? వివాహ వ్యవస్థ ఇంత వ్యాపారమయమైపోతున్నా... స్త్రీ వివాహితగా మారటం వైపే మొగ్గు చూపుతోందెందుకు? కేవలం ప్రొటెక్షన్ కోసమా, ప్రొడక్షన్ కోసమూనా?

దిలీప్‌తో ఏడేళ్ల అనుబంధాన్నివదులుకోలేక... మూల్యం చెల్లించే అతన్ని వివాహం

## మార్గం

"నాకు వచ్చే చాలీ చాలని జీతంతో నా కుటుంబం గడవడం చాలా కష్టంగా వుంటోంది. అందుకనే ఓ మార్గం ఆలోచించాము"

"ఏమిటది"

"మాయావిడ నేను విడాకులు తీసుకుందామనుకుంటున్నాము"

— బి.వి.ఎస్.బాబు (తెనాలి)



వేసుకున్నా దబ్బు ప్రాతిపదికగా ముడిపడిన ఆ బంధం పెళుసుగా వుండి కూలిపోతే —రేపటి తరంవాళ్లైన నా బిడ్డలు అనుబంధా లూ, ప్రేమల గురించి తెలుసుకోవడానికి ఏమీ మిగల్చలేనిదాన్నవుతాను.

అలాగని తల్లిదండ్రుల్ని ఎదిరించి వచ్చే యమనీ నేను చెప్పలేను. ఎందుకంటే నేను... రేపటి తల్లిని!! విషాదబాహువుల పరిష్వంగంలో ఒదిగిపోయింది నా మనసు!

చీకటి విచ్చుకుంటోంది. అంతవరకూ ఇసుకలో సందడిగా తిరిగినవారంతా ఒక్కొ క్కరే నిష్క్రమిస్తున్నారు. సముద్రపు కెర టాలు మాత్రం ఎగసిపడుతూనే వున్నాయి.

నేను లేచి హాస్టల్‌వైపు నడక సాగించాను.

రూంలో పడుకున్నా నిద్ర రాలేదు. రాదని నాకు తెలుసు! కిటికీలో నుండి బయటకు చూస్తూ కూర్చున్నాను. రేపు ఉదయాన్నే ఫోనొస్తుంది! ఏం చెప్పాలి దిలీప్‌కు?

అవే ఆలోచనలు నా మనసునిండా!

దిలీప్ లేని నా జీవితాన్ని ఊహించుకోలే ను. అలాగని అతనితో పెళ్లికోసం మూల్యా న్ని చెల్లించలేను!!

దిలీప్‌కోసం అతను తన తల్లిదండ్రుల మనస్తత్వాన్ని మార్చుకుని నన్ను వరించడాని కి వచ్చే ఘడియకోసం... ఓ జీవితకాలం ఇలానే నిరీక్షించగలను! కానీ ఇది జీవితం!! కాలం నాకోసం ఆగిపోదు. వాస్తవాలు తల్లక్రిందులు కాలేవు!

ఎలా...? ఎలా?? ఎలా???

మెదడులోని నరాలు చిట్లిపోతాయా అన్నం త ఆలోచనలు! ఎడతెగని ఆలోచనలు!!

పద్మవ్యూహంలాంటి ఆలోచనల మధ్య... అభిమన్యులా చిక్కుబడిన నేను — బహిర్మా ర్గాన్ని కనుగొనలేనా?? కిటికీలోనుండి చూ స్తూ కూర్చున్నాను. తెల్లవారుతోంది. తూ రుపు దిక్కున... ఆకాశాన్నలుముకున్న ఎర్ర దనాన్ని పారద్రోలుతూ వెలుగురేఖల్తో ఉద యిస్తోన్నాడు భానుడు! పక్షుల కిలకిలారావాల మధ్య వుండుండీ వినబడుతోంది చైత్రమా సపు కోయిల రాగాలాపన!!

కొబ్బరాకుల మధ్యనుండి ఆహ్లాదంగా కనిపిస్తోంది... ఉషోదయం!!

తలుపు తోసిన చప్పుడు. నిశ్శబ్ద భంగాని కి తలతిప్పి చూశాను. హాస్టల్ ఫోన్ గర్ల్!

''మానసమ్మా! మీకు ఫోను!

నాకు తెలుసు — దిలీప్‌నుండేనని! ఫోన్ దగ్గరకు నడిచాను. రిసీవర్ ఫోను ప్రక్కన వుంది... నా నిర్ణయాన్ని మోసుకెళ్లే రాయ బారిలా!

మళ్లీ ఆలోచించాను. స్ట్రైట్ సెకెండ్! అందే!!

రిసీవర్ అందుకున్నాను — పద్మవ్యూహా న్ని ఛేదించిన అభినవ 'అభిమన్యు'లా!!

◇ ◆ ◇

నేను కథానాయికనూ, కావ్యనాయికనూ కాను. కేవలం నా జీవిత నాయికను మాత్రమే! పెళ్లీడుకొచ్చిన ప్రతి ఆడపిల్లా నిజాయితీగా అంతర్ముఖురాలైతే... పెళ్లనే అందమైన అనుబంధం గురించి తాను కన్న కలల ప్రపంచానికీ, పసుపుతాడును వరకట్నం తో కొనుక్కోవలసిన దుస్థితిని దామకున్న

వాస్తవానికీ మధ్యనున్న వ్యత్యాసాన్ని గుర్తించి అంచెలంచెలుగా బేరీజు వేసుకుంటూ పోతే..

ఆ కన్నెపిల్ల హృదయతర్పణంలో నేనే దర్శనమిస్తాను. పద్మవ్యూహాన్ని ఛేదించడానికి పూనుకుంటున్న అభినవ 'అభిమన్యు'లా!

పువ్వుల్లాంటి అమాయక ఆడపిల్లల జీవితాలచుట్టూ... ఛేదించలేని ఈ పద్మవ్యూహాలు! ఇంకా ఎన్నాళ్లో??

అంకితం — కట్నకానుకల ప్రసక్తి లేకుండా వివాహం చేసుకున్న, చేసుకుంటున్న, చేసుకోబోతున్న ప్రతి జంటకీ...

